క్లుప్తంగా

పేస్ కాలేజీకి ఎన్‌పీటీఈఎల్ గుర్తింపు


ఎన్‌పీటీఈఎల్ సర్టిఫికెట్ చూపుతున్న సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీకి ఎన్‌పీటీఈఎల్ 'ఏఎం' ర్యాంకును ఐఐటీ మద్రాస్ బహూకరించింది. కాలేజీకి చెందిన విద్యార్థులు వివిధ విభాగాలలో గల్డ్ ఎలైట్ సర్టిఫికెట్లు సాధించారు. మొత్తంగా కాలేజీ నుంచి 1200 మందికిపైగా విద్యార్థులు సర్టిఫికెట్ పరీక్షకు హాజరవగా, 802 మంది ఉత్తీర్ణులయ్యారు. వారిలో 74 మంది గల్డ్ ప్లస్ ఎలైట్ సాధించారు. ఈ సందర్భంగా కాలేజీలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆ వివరాలను కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, ఎన్‌పీటీఈఎల్ లోకల్ చాప్టర్ కో ఆర్డినేటర్ డాక్టర్ టీఆర్ చైతన్య, కాలేజీ కో ఆర్డినేటర్ షేక్ హీనా కౌసర్ పాల్గొని విద్యార్థులను అభినందించారు.

పొగాకు ధర గరిష్టంగా రూ.344

- ఆర్‌ఎం ఎం.లక్ష్మణరావు వెల్లడి

ఒంగోలు సెంట్రల్: రీజియన్ పరిధిలో పొగాకు ధరలు సోమవారం గరిష్టంగా రూ.344 పలికిందని ఆర్‌ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలో సోమవారం 7621 బేళ్లు రాగా, 7039 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేయగా, 582 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో ఒంగోలు, కొండపి కేంద్రాల్లో 88వ రోజు వేలం పాటలో 3905 బేళ్లు రాగా, 3706 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 199 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో కేజీ గరిష్టంగా రూ.344, కనిష్టంగా రూ.205, సరాసరి రూ.295.79 వచ్చినట్లు చెప్పారు. అదేవిధంగా మార్చి 6న ప్రారంభమైన డీసీపల్లి, కలిగిరి, కందుకూరు-2, వెల్లంపల్లి, పొదిలి, కనిగిరి కేంద్రాల్లో 3716 బేళ్లు రాగా, 3333 బేళ్లు కొనుగోలయ్యాయి. 383 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో గరిష్టంగా రూ.340, కనిష్టంగా రూ.205, సరాసరి రూ.207.50 వచ్చాయి.

వైభవంగా అంకాలమ్మ తల్లి తిరునాళ్ల


దాసళ్లపల్లిలో అంకాలమ్మ తల్లికి ఏర్పాటు చేసిన కుంకుమ బండ్లు

హనుమంతునిపాడు: మండల పరిధి దాసళ్లపల్లి గ్రామ సమీపాన దోమలేటి ఒడ్డున వెలసిన అంకాలమ్మ తల్లి తిరునాళ్ల సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంకాలమ్మ తల్లికి ప్రత్యే పొంగళ్లు, కుంకమ బండ్లు ఏర్పాటు, కొర్లబండి ఉత్సాహం వైభవంగా నిర్వహించారు. దసళ్లపల్లి, చిన్నదాసళ్లపల్లి, ముప్పాళ్లపాడు గ్రామస్తులు ఏర్పాటుచేసిన కుంకమ బండ్లు మేళతాలు సందడితో గ్రామోత్సం నిర్వహించారు. భక్తులు దేవస్థానం చుట్టూ ప్రదక్షణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాలు, గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పొంగళ్లు పొంగించి మొక్కులు చెల్లించుకున్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొండపి(సింగరాయకొండ): కొండపిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆరో తరగతి, ఏడో తరగతిలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.అరుణ సోమవారం తెలిపారు. మంగళవారం సాయంత్రం 5 గంటల్లోపు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బుధవారం ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహించి, ప్రతిభ చూపిన విద్యార్థులకు పాఠశాలలో ప్రవేశం కల్పిస్తామని స్పష్టం చేశారు.

7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

సింగరాయకొండ: జూలై 7వ తేదీన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈదుమూడిలో నిర్వహించనున్న జనజాతర సభను విజయవంతం చేయాలని జిల్లా కన్వీనర్ రావినూతల కోటిమాదిగ కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం కరపత్రాన్ని ఆవిష్కరించారు.

గురుకులానికి 80 సీట్లు మంజూరు

సింగరాయకొండ: స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియెట్ ఎంపీసీకి 40 సీట్లు, బైపీసీకి 40 సీట్లు మంజూరైనట్లు గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ డి.జయ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరం నుంచి ఈ సీట్లు వినియోగంలోకి వస్తాయన్నారు. ప్రస్తుతం కాలేజీలో సీఈసీ గ్రూప్‌నకు 80 సీట్లు ఉండగా, ప్రభుత్వం అదనంగా మరో 80 సీట్లు మంజూరు చేసిందని వివరించారు. విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత ఆధారంగా సీట్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి

- గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులు శుభ్రం చేయించాలి
- ఎంపీడీఓ శ్రీహరి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీహరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఈఓపీఆర్‌డీ

మద్దిపాడు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ శ్రీహరి సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని, అందులో భాగంగా గ్రామాల్లో శానిటేషన్ పనులు ముమ్మరంగా చేయాలని, ఓవర్‌హెడ్ ట్యాంకులు శుభ్రం చేయించాలని చెప్పారు. ప్రభుత్వం స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్న దృఢ సంకల్పంతో ఉందన్నారు. అందువలన బావుల్లో సైతం క్లోరినేషన్ చేయించాలని ఆయన సూచించారు. డయేరియా వంటి ప్రమాదకరమైన వ్యాధులు ప్రబలకుండా చూసుకోవాలని తెలిపారు. ట్యాపుల ద్వారా అందించే నీటిని పరిశీలించాలని చెప్పారు. ఎక్కడైనా మురికి నీరు వస్తుంటే వెంటనే సంబంధిత అధికారులకు తెలిపి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేంద్ర మాట్లాడుతూ గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులను క్లీన్ చేయించడానికి తమ శాఖ తరఫున చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలుంటే వెంటనే తనకు తెలియజేయాలని ఆయన కోరారు. ఆస్పత్రి సూపర్‌వైజర్ బాలకోటయ్య మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ లేకుండా చూసుకునే విధంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా పలు చర్యలను వైద్యశాఖ తరఫున తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రఘుబాబు, గ్రామ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారు

భక్తిశ్రద్ధలతో శ్రీవారి ఆస్థానం

ఒంగోలు మెట్రో: స్థానిక కొండమీద శ్రీగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీవారి ఆస్థానం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన ఉత్సవమూర్తులను భక్తులు దర్శనం చేసుకున్నారు. ఆలయ అర్చకులు, వేద పండితులు శ్రీవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నాద నీరాజనం, చతుర్వేద పారాయణ, విష్ణు సహస్ర నామ పారాయణం, రామాయణం, భగవద్గీత, భాగవతం వంటి పవిత్ర గ్రంథాల కావ్యాలలోని పద్యాలను, శ్లోకాలను గానం చేశారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వేంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారి తదితరులు పర్యవేక్షించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

జూనియర్ కళాశాల కొనసాగేనా?


వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

కురిచేడు: మండలానికి గత ప్రభుత్వం జూనియర్ కళాశాలను మంజూరు చేసింది. దాన్ని నిలబెట్టుకోవడంలో ఉపాధ్యాయులు, నాయకులు బాధ్యతగా వ్యవహరిస్తున్నారా? లేక కళాశాలను జారవిడుచుకుంటారా? అనేది ప్రతి ఒక్కరిలో ఉన్న ప్రశ్న. మండలంలో ఇప్పటి వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు కాలేదు. మండలం నుంచి సుమారు 500-600 మంది విద్యార్థులు జిల్లాలోని దర్శి, పొదిలి, పల్నాడు జిల్లా వినుకొండ, నరసరావుపేట, గుంటూరు తదితర ప్రాంతాలకు వెళ్లి ఇంటర్, డిగ్రీలు చదువుతున్నారు. ఆర్థిక స్థోమత లేని విద్యార్థులు 10వ తరగతితో తమ చదువులకు ఫుల్‌స్టాప్ పెడుతున్నారు. 1992-2016 వరకు మాగుంట సుబ్బరామరెడ్డి జూనియర్ కళాశాల నిర్వహించారు. ఆ సమయంలో ప్రభుత్వం జూనియర్ కళాశాల మంజూరు చేసేందుకు ఎంఎస్‌ఆర్ జూనియర్ కళాశాలను సాకుగా చూసి మంజూరు చేయలేదు. ఆ తర్వాత ఎంఎస్‌ఆర్ జూనియర్ కళాశాల కూడా నిలిచిపోవడంతో విద్యార్థులు తిరిగి ఇతర పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంజూరు చేసిన జూనియర్ కళాశాలలో ఎంపీసీ, సీఈసీ గ్రూపులను తొలుత నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దానికి రెండు గ్రూపులకు కలిసి 80 మంది విద్యార్థులకు అవకాశం ఉంది. కనీసం 40 మంది విద్యార్థులు చేరినా కళాశాల నిర్వహించేందుకు అవకాశం ఉంటుంది.

పదో తరగతిలో 580 మంది ఉత్తీర్ణత

మండలంలోని 7 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాల, 6 ప్రైవేటు పాఠశాలల నుంచి ఈ ఏడాది 580 మంది విద్యార్థులు 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించారు. వారిలో కనీసం 80 మంది జూనియర్ కళాశాలలో చేరినా మండలానికి జూనియర్ కళాశాల శాశ్వతంగా నిలిచిపోయి పేద విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. జూనియర్ కళాశాల ఏర్పాటు, దాని వలన కలిగే ఉపయోగాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులకు కళాశాల కొనసాగింపుపై ఉన్న అనుమానాలను నివృత్తి చేయడంలో ఉపాధ్యాయులు, నాయకులు విఫలమయ్యారని చెప్పవచ్చు. మండలంలో సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఉప సర్పంచ్‌లు, సొసైటీ ప్రెసిడెంట్లు 46 మంది ఉన్నారు. నామినేటెడ్ పదవులు, పార్టీ పదవులు కలిగినవారు అన్ని పార్టీల నుంచి వందకుపైగా ఉన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు, గురుకుల, కేజీబీవీల్లో ఉపాధ్యాయులు, విద్యాశాఖలోని ఉద్యోగులు మరో 200 మంది వరకు ఉంటారు. వీరంతా ప్రచారం నిర్వహించి ఉంటే నేడు ఈ దుస్థితి వచ్చేది కాదు. అంతేకాకుండా నాయకులు ఒక్కొక్కరు ఒక్కో విద్యార్థిని కళాశాలలో చేర్పించినా జూనియర్ కళాశాల నిర్విఘ్నంగా కొనసాగుతుంది. కాని ఆ దిశగా ఒక్కరు కూడా ఇప్పటి వరకు ఆలోచించిన దాఖలాలు లేవని చెప్పవచ్చు. పార్టీలకతీతంగా జూనియర్ కళాశాలను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. ఈ విషయంలో ముందుండాల్సిన విద్యాశాఖ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా అందరూ సమష్టిగా కృషి చేసి జూనియర్ కళాశాలకు విద్యార్థులను చేర్పించి కళాశాల కొనసాగేలా చూడాల్సిన అవసరం ఉంది.

ప్రాంగణ ఎంపికల్లో 165 మందికి ఉద్యోగాలు


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో చైర్మన్, అధ్యాపక బృందం

ఒంగోలు సెంట్రల్: స్థానిక శ్రీ హర్షిణి డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 165 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ దాది ఆంజనేయులు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన టెక్ మహీంద్ర కంపెనీలో ఉద్యోగాలకు 15 మంది విద్యార్థులు రూ.2.5 లక్షల వార్షిక వేతనంతో ఎంపికయ్యారు. సుథర్ ల్యాండ్ గ్లోబల్ సర్వీసెస్ కంపెనీకి 15 మంది విద్యార్థులు రూ.3 లక్షల వార్షిక వేతనంతో, జెన్‌ప్యాక్ట్ కంపెనీకి 60 మంది విద్యార్థులు రూ.2.4 లక్షల వార్షిక వేతనంతో, అరబిందో ఫార్మసీ కంపెనీకి చెందిన 16 మంది విద్యార్థులు రూ.2 లక్షల వార్షిక వేతనంతో, బెంగళూరుకు చెందిన ఆల్‌సెక్ కంపెనీకి 36 మంది విద్యార్థులు రూ.2.13 లక్షల వేతనంతో, ఒంగోలుకు చెందిన ఏసీఈ స్పోకెన్ ఇంగ్లిష్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్ అకాడమీకి 23 మంది విద్యార్థులు రూ.18 లక్షల వేతనంతో ఎంపికైనట్లు వివరించారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకు 775 మంది విద్యార్థులు వివిధ కంపెనీలకు ఎంపికైనట్లు చైర్మన్ గోరంట్ల రవికుమార్ తెలిపారు. నూతనంగా ఎంపికైన విద్యార్థులను చైర్మన్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గోరంట్ల కవిత, పీజీ కో ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి, ఏవో ర్యాంకర్ శ్రీనివాసరావు అభినందించారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత


విద్యార్థులకు నగదు బహుమతులిస్తూ సత్కరిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు, ఉపాధ్యాయులు

చీమకుర్తి: పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానం సాధించిన ఇద్దరు విద్యార్థులకు సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు సోమవారం నగదు బహుమతులు అందించారు. సంతనూతలపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.10,116, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.5,116 నగదు అందించి శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో సేవా సంకల్ప ట్రస్ట్ అధ్యక్షుడు శనగల వెంకట రమణ, వైస్ చైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి, సభ్యులతో పాటు రిటైర్డ్ హెచ్‌ఎం రామారావు, ఇన్‌చార్జి హెచ్‌ఎం ఉమామహేశ్వరి, ఎంఈఓ వెంకారెడ్డి పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండండి




మార్కాపురం : మాట్లాడుతున్న ఎంపీడీఓ చందన

మార్కాపురం రూరల్: ప్రజలు డయేరియాపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ చందన సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయితీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలని, దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఓవర్‌హెడ్ ట్యాంకులను క్లోరినేషన్ చేయించాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సృజన, ఈఓపీఆర్‌డీ రామ్మోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కొనకనమిట్ల: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గొట్లగట్టు పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ నారాయణరెడ్డి సూచించారు. మలేరియా మాసోత్సవాలను పురస్కరించుకుని సోమవారం నాగంపల్లి యూపీ, గొట్లగట్టు కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కేజీబీవీ పాఠశాలలో ఎబేట్ పిచికారీ చేయించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఎస్ వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


నాగంపల్లిలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీహెచ్‌ఈఓ

27న ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా

మార్కాపురం రూరల్: మార్కాపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 27న క్యాంపస్ రిక్రూట్‌మెంట్ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.నరేంద్రనాథ్ తెలిపారు. ఐటీఐ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, పూర్తిచేసిన విద్యార్థులు ఈ జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. తిరుపతికి చెందిన అమర్‌రాజా బాటరీస్, హైదరాబాద్‌కు చెందిన హెటిరో డ్రగ్స్, తోషిబా ఎలక్ట్రికల్స్, జనతా ఆటో సొల్యూషన్స్, శ్రీసిటీకి చెందిన ఏషియన్ పెయింట్స్, చెన్నైకి చెందిన రిడ్జ్ ఇండియా లిమిటెడ్ తదితర కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నట్లు చెప్పారు. అభ్యర్థులు బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా అడ్డగింత

- ఇద్దరికి రూ.75 వేలు జరిమానా

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలం సతుకుపాడు ఇసుక రీచ్‌లో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా సెబ్ ఎస్సై సీహెచ్ దయాకర్ తన సిబ్బందితో సోమవారం తెల్లవారుజామున దాడి చేశారు. ఒంగోలు మండలం వెంగముక్కలపాలేనికి చెందిన జేసీబీ డ్రైవర్ కె.రవికి రూ.50 వేలు, కనిగిరికి చెందిన టిప్పర్ డ్రైవర్ కొణిదెల శ్యాంకు రూ.25 వేలు జరిమానా విధించారు. ఎస్సై దయాకర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం జరిమానా మాత్రమే విధించామని, మళ్లీ అక్రమ రవాణాకు పాల్పడితే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు మాజీ ఎమ్మెల్యే కేపీ పరామర్శ


మహేష్‌రెడ్డిని పరామర్శిస్తున్న కేపీ నాగార్జునరెడ్డి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని నల్లబండ బజారుకు చెందిన మహేష్‌రెడ్డి అనే వైఎస్సార్ సీపీ కార్యకర్తకు ఇటీవల బైక్ ప్రమాదంలో కాలు విరిగింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సోమవారం అతడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. మహేష్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారిని తాను ఎప్పటికీ విస్మరించనన్నారు. నియోజకవర్గంలో జగనన్న అభిమానులు అధికంగా ఉన్నారని, వారి అండదండలతో పార్టీ కార్యకర్తలకు పూర్తిగా అండగా నిలుస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట కౌన్సిలర్ మానం బాలిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాలుగుళ్ల నరసింహారెడ్డి, బొర్రా కృష్ణారెడ్డి, పోతుగంటి పీరయ్య ఉన్నారు.

మాదకద్రవ్యాలతో యువత భవిష్యత్ అంధకారం

- సెబ్ డీఎస్పీ దుర్గాప్రసాద్


మాట్లాడుతున్న సెబ్ డీఎస్పీ దుర్గా ప్రసాద్

మార్కాపురం: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సెబ్ డీఎస్పీ దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సాధనా డిగ్రీ కళాశాలలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలపై యువతకు దిశానిర్దేశం చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ఉజ్వల భవిష్యత్ కావాలనుకుంటే మాదకద్రవ్యాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సెబ్ సీఐ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసయ్యే వారిలో యువతే ఎక్కువగా ఉండటం దురదృష్టకరమన్నారు. ఒక్కసారి డ్రగ్స్‌కు బానిసైతే జీవితం అంధకారం అవుతుందన్నారు. సెబ్ ఎస్సై ఎంవీ గోపాలకృష్ణ మాట్లడుతూ యువత చదువుపైనే దృష్టిసారించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె మధుసూధన్, కరస్పాండెంట్ డి.రాజగోపాల్‌రెడ్డి, డైరెక్టర్లు ఎమ్‌వీ కృష్ణారెడ్డి, వీఆర్‌కె ప్రసాద్, డాక్టర్ వెన్నా కృష్ణారెడ్డి, జీఎల్ రమేష్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌కుమార్, క్యాంపస్ సెల్ ఇన్‌చార్జి పవన్‌కుమార్, డాక్టర్ ఎం.శేషుకుమార్, డాక్టర్ పీఆర్‌కే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్స్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

బేస్తవారిపేట: సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి ఈ.రాజేశ్వరమ్మ కోరారు. బేస్తవారిపేట ఎస్‌డబ్ల్యూఓ పరిధిలో ప్రీమెట్రిక్ వసతి గృహాలు 8, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలు మూడు ఉన్నాయన్నారు. 3వ తరగతి నుంచి పదో తరగతి, ఇంటర్ నుంచి పీజీ చదివే విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరానికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ ఓన్ స్టడీ మెటీరియల్, హాస్టల్స్‌లో ట్యూటర్స్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. విద్యార్థిని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు

- డిప్యూటీ డీఈఓ ప్రసాదరావు


తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ ప్రసాదరావు

ఉలవపాడు: ప్రైవేట్ పాఠశాలల్లో ఎక్కువ ఫీజులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని కందుకూరు డిప్యూటీ డీఈఓ ప్రసాదరావు హెచ్చరించారు. మండల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఉలవపాడులోని సెయింట్ జోసఫ్స్ స్కూల్, శ్రీసాయి హైస్కూల్, గుడ్‌న్యూస్ స్కూల్‌లలోని రికార్డులను పరిశీలించారు. గుడ్ న్యూస్ స్కూల్‌లో ఫీజుల కలెక్షన్‌కు సంబంధించి పుస్తకం ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. తల్లిదండ్రులతో మాట్లాడారు. ఫీజులు ఎంత తీసుకుంటున్నారని అడిగారు. ఎక్కువ ఫీజులు వసూలు చేస్తే ఫిర్యాదు చేయాలని తెలిపారు. పాఠశాలల్లో పుస్తకాలు కలిగి ఉన్న రూంలను పరిశీలించగా సొంత సిలబస్ కలిగిన పుస్తకాలు ఉన్నట్లు గుర్తించారు. వారి పాఠ్యాంశాలకు అనుగుణంగా తెప్పించుకున్నట్లు గుర్తించారు. ఫీజులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వసూలు చేయాలని తెలిపారు. లేకుంటే స్కూల్ యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎంఈఓ రమణయ్య, సీఆర్‌పీలు ఉన్నారు.

మధ్యాహ్న భోజనంలో మంచినీరు వాడండి

ఉలవపాడు: మధ్యాహ్న భోజన పథకంలో మంచినీరు వాడాలని, ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో పలు చోట్ల డయేరియా వ్యాపిస్తున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కందుకూరు డిప్యూటీ డీఈఓ ప్రసాదరావు అన్నారు. ఉలవపాడు ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో సోమవారం ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు నీళ్ల ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులు చేతులను కడుక్కున్న తరువాత మధ్యాహ్న భోజనం పెట్టాలన్నారు. చేతుల పరిశుభ్రతపై సూచనలు అందించారు. నేను బడికి వస్తా నిర్వహించాలన్నారు. పాఠశాలలోని విద్యా సామాగ్రిని సిద్ధం చేసుకోవాలన్నారు. విద్యా ప్రవేశ్ కార్యక్రమంతో పాటు పాలనా పరమైన విషయాలను ప్రధానోపాధ్యాయులకు తెలియచేశారు. కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు సలీమ్‌బాషా, శ్రీనివాసరావు, జనార్దన్, శివనాగేశ్వరరావు, కోటేశ్వరరావు తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన ప్రధానోపాధ్యాయులు